క్లుప్తంగా

నేడు మండల స్థాయిలో అధికారులకు శిక్షణ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. గ్రామ పంచాయతీలలో 2025–26 వార్షిక ప్రణాళికలు తయారు చేయుటకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీవోఏలు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అన్నదాన పథకానికి భక్తుల విరాళం



దేవరపల్లి అయ్యప్ప ఆలయం వద్ద అన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

దేవరపల్లి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏటా నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి దేవరపల్లికి చెందిన తంగెళ్ల సూర్యనారాయణ, అన్నవరం, తంగెళ్ల నాగేంద్ర, వెంకటలక్ష్మి దంపతులు బుధవారం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని వారు ఆలయం వద్ద గల గురుస్వాములకు అందజేశారు. ఈ విరాళాన్ని శాశ్వత అన్నదాన నిర్వహణకు వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మండలంలోని కొత్తగూడెంకు చెందిన రామాలయం పీఠం అయ్యప్పస్వాముల అన్నదానం నిమిత్తం 100 కిలోల బియ్యం ఆలయానికి అందజేశారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల అందజేత



విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేసిన లక్ష్మణరావు దంపతులు

గోపాలపురం: స్థానిక జేబీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం దాత భోజనం ప్లేట్లు విరాళంగా అందజేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ మాజీ అధ్యక్షుడు, ఎల్ఐసీ ఏజెంట్ గుబ్బా లక్ష్మణరావు, స్వాతి దంపతులు ఈ పాఠశాల్లో చదువుకుంటున్న సుమారు 65 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.శ్రీనివాసరావు, హెచ్ఎం పైడి సురేష్‌బాబు, విద్యా కమిటీ చైర్ పర్సన్ బొర్రా కామేశ్వరి, సీఆర్పీ కె.నాగరాజు పాల్గొన్నారు.

అరకొర రేషన్

- లబ్ధిదారులకు సరకుల కేటాయింపులో కోత
- 1,605 మందికి అందని కందిపప్పు
- 1,295 మందికి చేరని అర కిలో పంచదార
- మండిపోతున్న నిత్యావసరాల ధరలు
- కూటమి సర్కార్ తీరుపై మండిపాటు

కొవ్వూరు: మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. సామాన్యుడి బతుకు భారంగా మారింది. వచ్చే ఆదాయానికి నెలవారీ ఇంటి ఖర్చులకూ ఎక్కడా పొంతన కుదరడం లేదు. కూటమి ప్రభుత్వం కందిపప్పు, పంచదారలను చౌక దుకాణాల ద్వారా సబ్సిడీపై అందిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటోంది. గత నెలలో కందిపప్పు అర కొరగా అందించి చేతులు దులుపుకున్నారు.

మండలం	కార్డులు	పంచదార (ప్యాకెట్లు)	కందిపప్పు
కొవ్వూరు	33,968	21,716	21,458
చాగల్లు	21,458	33,317	33,967
నిడదవోలు	35,166	35,601	33,569
పెరవలి	23,636	22,173	23,629
ఉండ్రాజవరం	24,665	24,794	24,665

రేషన్ కార్డుదారులకు నవంబర్‌లో పంచదార అర కిలో, కందిపప్పు కిలో చొప్పున అందిస్తున్నట్టు ప్రకటించారు. కేటాయింపులు మాత్రం నామమాత్రంగా చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 2,38,144 రేషన్ కార్డులు ఉన్నాయి. ఊనగట్ల ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా కొవ్వూరు,చాగల్లు, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు రేషన్ సరఫరా చేస్తున్నారు. ఈ ఐదు మండలాల పరిధిలో 1,38,893 రేషన్ కార్డులున్నాయి. లబ్ధిదారులకు అరకిలో చొప్పున 69,446.5 కిలోల పంచదార కేటాయించాల్సి ఉండగా 68,880.5 కిలోలు మాత్రమే కేటాయించారు. మొత్తం లబ్ధిదారుల్లో 1,292 మందికి కోత విధించారు. 1,37,601 మంది లబ్ధిదారులకు మాత్రమే పంచదార ప్యాకెట్లు అందించారు. కందిపప్పు కిలో చొప్పున అందించాల్సి ఉండగా 1,605 మందికి కోత విధించి 1,37,288 మందికి మాత్రమే పంపిణీ చేశారు. డివిజన్‌లోని మిగిలిన దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి మండలాలకు కూడా కేటాయింపులు ఇదే విధంగా ఉన్నాయి.



కొవ్వూరులో వ్యాన్ ద్వారా రేషన్ సరకులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

కందిపప్పు రేటు బహిరంగ మార్కెట్ నాణ్యతను బట్టి కిలో రూ.180 నుంచి రూ.200 వరకూ పలుకుతుంది. కిలో రూ.67 కే చౌక దుకాణాల ద్వారా అందిస్తున్నారు. పంచదారను అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుదారులకు మాత్రం అర కిలోకు రూ.14లు, మిగిలిన కార్డుదారులకు అర కిలోకు రూ.17ల చొప్పున వసూలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో పంచదార కిలో రూ.42 నుంచి రూ.50 వరకూ ధర పలుకుతోంది. నిత్యావసరాల ధరలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం పంచదార, కందిపప్పు పూర్తిస్థాయిలో లబ్ధిదారులందకీ అందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పంచదార కేవలం అర కిలో చొప్పున మాత్రమే సరఫరా చేయడంపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు.

కోత పెట్టడం సమంజసం కాదు



మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం వాటిని నియంత్రించాలి. రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే సరకుల పంపిణీలో కోత విధించడం సమజసం కాదు. రేషన్ కార్డుదారులందరికీ పంచ దార,కందిపప్పు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంచదార కేవలం అరకిలో మాత్రమే ఇవ్వడం అన్యాయం.

– ఎం.సుందరబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కొవ్వూరు

17న దేవరపల్లి మండల సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.



ధైర్యంగా సాక్ష్యం చెబితేనే బాధితులకు న్యాయం

- సీఐడీ అడిషనల్ ఎస్పీ అన్న వర్షిన్
- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అన్న వర్షిన్

నిడదవోలు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాక్షులు ధైర్యంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెపితేనే బాధితులకు న్యాయం జరుగుతుందని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం అడిషనల్ ఎస్పీ అన్న వర్షిన్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో అడిషనల్ ఎస్పీ అన్న వర్షిన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసినప్పటికీ ట్రయల్ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పక పోవడంతో నిందితులకు శిక్షలు పడడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నిడదవోలు తహసీల్దార్ నాగరాజు నాయక్ తన ప్రసంగంలో అంటరానితనం, కుల దుర్వినియోగం, దీనిపై సంబంధిత అధికారులకు ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన కల్పించారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాలరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, స్వాతంత్ర్యం తర్వాత సమాజంలో అంటరానితనం నిర్మూలన, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్, అట్రాసిటీ యాక్ట్, చట్ట పరిధిలో జరిగే నేరాలు, చట్టం ఇంప్లిమెంటేషన్, స్పెషల్ కోర్టుల గురించి వివరించారు. రిటైర్డు పోలీస్ ఉద్యోగి సాల్మన్‌రాజు తన ప్రసంగంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 గురించి వివరించారు. కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కులవ్యవస్థ, సమాజంలోని అసమానతలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన పాత్ర, పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్, నిడదవోలు సీఐ తిలక్, పట్టణ ఎస్సై శోభన్ కుమార్, రూరల్ ఎస్సై వీరబాబు, గెడ్డం రవీంద్ర, సీఐడీ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరులో కొండచిలువ హల్‌చల్



శివాలయంలో సిమెంటు బల్ల కింద కొండచిలువ

కొవ్వూరు: స్థానిక పంచాయతన శివాలయం దిగువ అంతస్తులో బుధవారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. శివాలయం దిగువ అంతస్తులో వివాహం జరుగుతోంది. ఈ వివాహానికి హాజరైన వారు గేట్లు తీసి లోపలికి వెళ్లారు. సిమెంటు బల్ల కింద మెరుస్తున్నట్టు కనిపించడంతో అక్కడికి వెళ్లి అది కొండచిలువగా గుర్తించారు. జనం అరుపులు, పెళ్లి బజాలు మోగుతుండడంతో కొండచిలువ మెల్లగా అక్కడి నుంచి జారుకుంది. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఈ కొండ చిలువ కొట్టుకుని వచ్చి ఉండవచ్చునని భావిస్తున్నారు. అటవీ శాఖకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి డి. రాజేష్ సిబ్బంది,స్నేక్ క్యాచర్‌తో వచ్చి కొండ చిలువను గాలించి పట్టుకున్నారు.

ర్యాంపుల్లో ఆగని ఇసుక దందా



తీపర్రు ఇసుక ర్యాంపులో పొక్లెయిన్‌తో లారీకి ఇసుక లోడింగ్

పెరవలి: అధికారులు ర్యాంపులను పదే పదే తనిఖీ చేస్తున్నా ఇసుక దోపిడీ ఆగడం లేదు. దళారీలు, కాంట్రాక్టర్లు కలసి ఉచిత ఇసుక పథకానికి తూట్లు పొడుస్తున్నారు. ర్యాంపుల్లో అధికారులు ఉన్నంత సేపూ లోడింగ్ నిలుపుదల చేసి, ఇసుక కొరత సృష్టిస్తున్నారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లగానే లారీలు, ట్రాక్టర్ల వారి వద్ద నుంచి దోపిడీకి తెర తీస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇసుక దోపిడీ తారాస్థాయికి చేరింది. కానూరు–పెండ్యాల ర్యాంపులో ఇసుక దందా ఎక్కువగా ఉందని కలెక్టర్‌కు నేరుగా లారీల యూనియన్ ప్రెసిడెంట్ రావూరి రాజు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పందలపర్రు, పెండ్యాల–కానూరు ఇసుక రీచ్‌లు తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆమె అక్కడే ఉండి లారీలకు ఇసుక ఎగుమతి చేయించారు. అయినప్పటికీ బుధవారం మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. తమ నుంచి కాంట్రాక్టర్లు అధిక మొత్తం సొమ్ములు వసూలు చేశారని లారీ డ్రైవర్లు ఆరోపించారు. 20 టన్నుల లారీకి కేవలం రూ.1380 చెల్లించాల్సి ఉండగా, కానూరు–పెండ్యాల ర్యాంపులో రూ.6500, పందలపర్రు ర్యాంపులో రూ.6500, తీపర్రు ర్యాంపులో రూ.6000 చొప్పున బుధవారం వసూలు చేశారు. ఇక ట్రాక్టర్లకు పందలపర్రులో రూ.750, కానూరు–పెండ్యాల ర్యాంపులో రూ.1000, తీపర్రులో రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. కానూరు–పెండ్యాల ర్యాంపులో ఇసుక ఎగుమతి చేసిన కూలీలకు రూ.500, ఎగుమతి చేసుకుని గట్టు దిగిన వెంటనే కాంట్రాక్టర్ సిబ్బంది మరో రూ.500 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే ఇసుక లేదు వెళ్లి పొమ్మంటున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు నేరుగా ఇసుక కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఈ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇసుక ఉచిత విధానం విఫలం

గోపాలపురం: కూటమి ప్రభుత్వం అధికారంల చేపట్టి నాలుగు నెలలు గడుస్తున్నా ఇసుక ఉచిత సరఫరా కాగితాలకే పరిమితమైంది తప్ప, ఆచరణకు నోచుకోలేదని పీసీసీ సభ్యులు జేష్ఠ సతీష్‌బాబు ప్రభుత్వాన్ని విమర్శించారు. మండలంలోని వెదుళ్లకుంటలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక మార్గదర్శకాలు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా ఉన్నాయి తప్ప సామాన్యులకు ఏమాత్రం అనుకూలంగా లేవన్నారు. ప్రభుత్వాదాయానికి గండి పడేలా ఇసుక పాలసీని తయారుచేశారన్నారు. పాలసీలో మార్పులు చేసి ప్రజలకు ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

నల్లజర్ల: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకొని ముందుకు సాగితే, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని ప్రకాశరావుపాలెం, ఆవపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటల సాగులో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా కమల్‌రాజ్ వారికి వివరించారు. కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో లింగాకర్షక బుట్టలు, పసుపు అట్టల ఏర్పాటు, బయోకల్చర్ తదితర విషయాలపై వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టరు శేష, డాక్టరు రేఖ అవగాహన కల్పించారు. కోకో పంటను ఆశించే పిండినల్లి నివారణ చర్యలను వివరించారు. పామాయిల్ విస్తరణ పథకంలో రాయితీలను ఉద్యానశాఖాధికారి బబిత వెల్లడించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాడపల్లిలో రెవెన్యూ గ్రామసభ

కొవ్వూరు: రీ సర్వేలో తమ గ్రామ రైతుల భూములు తప్పుగా నమోదయ్యాయని, ఒకరి భూములను మరొకరికి మార్చేశారని వాడపల్లి గ్రామ రైతులు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌కు రాతపూర్వకంగా వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ రీ సర్వే గ్రామసభను వాడపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. లోగడ జరిగిన రీ సర్వేపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు.ఆ వివరాలను రైతులను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేను రద్దు చేసి, 2019కి ముందు ఉన్న రికార్డుల ప్రకారం రెవెన్యూ రికార్డులను కొనసాగించాలని రైతులు కోరారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, సర్పంచ్ గెల్లా ప్రసాద్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





పోతవరంలో క్షీరాబ్ధి ద్వాదశ పూజలు

నల్లజర్ల: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా పోతవరంలోని ఉమారామలింగేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ఘనంగా క్షీరాబ్ధి ద్వాదశ పూజలు నిర్వహించారు. హరోం..హరా అంటూ శివభక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుఝామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయంలో ప్రదక్షణలు చేసి స్వామివారి అభిషేకాల్లో పాల్గొన్నారు. వేదపండితులు సూరిబాబు, నరసింహమూర్తి, ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. అనంతరం సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. ఆలయ ధర్మకర్త పాపా శ్రీనివాస్, ప్రత్తిపాటి అమ్మిరాజు,గద్దే నరసింహమూర్తి, మోత్కూరి శ్రీనివాస్, నాయుడు కొండలరావు, డాక్టరు సాయిబాబా, నాయుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెలటూరులో అన్న సమారాధన

చాగల్లు: కార్తిక మాసం సందర్భంగా నెలటూరు గ్రామంలోని సత్యనారాయణస్వామి వారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఏకాహం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆలయం వద్ద భారీఎత్తున అన్నసమారాధన జరిగింది. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలోభక్తులు హాజరై, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నెలటూరు కోడూరివారి రామాలయంలోనూ అన్న సమారాధన జరిగింది.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: చెట్లకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం అనంతపల్లి సబ్ స్టేషన్‌లోని తెలికిచెర్ల ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు.ఈ ఫీడర్‌లోని వ్యవసాయ అవసరాలకు ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్తు సరఫరా ఉంటుందన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



ప్రారంభ సమావేశంలో క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతున్న కమాండెంట్ కల్నల్ అమిత్ పాండే

కల్నల్ అమిత్ పాండే



ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

నల్లజర్ల: దేశభక్తి, ఆత్మ విశ్వాసంతో పాటు క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్టు 19 ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో 12 కళాశాలలు, 23 పాఠశాలలకు చెందిన 624 మంది క్యాడెట్లకు స్థానిక ఏకేఆర్జీ హైస్కూలులో 10 రోజుల నిర్వహించనున్న శిక్షణ బుధవారం ప్రారంభమైంది. క్రమశిక్షణకు మారుపేరుగా దేశం కోసం యువసైనికులను తీర్చిదిద్దుతున్నట్టు పాండే వివరించారు. దేశానికి సేవ చేయడానికి ఇదో మంచి అవకాశమన్నారు. సమావేశంలో ఏకేఆర్జీ విద్యాసంస్థల చైర్మన్ చావా గోకుల్, కరస్పాండెంట్ వడ్లమూడి రమారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి మాస కల్యాణం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ వేడుకలు మంగళవారం రాత్రి ఆలయ మంటపంలో వైభవంగా జరిగాయి. కార్తిక ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారికి మాస కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దుర్గా ప్రసాదాచార్యులు, వేందాత కేశవాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. దాపర్తి వీరభద్రం, అచ్యుతాంబ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. విశేషంగా భక్తులు పాల్గొన కల్యాణ వేడుకలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.